# నీడ కథ

[అండర్సన్ ఆధారంగా]

కె. సభా

[గత సంచిక తరువాయి]

"నేను చెప్పినదానిలో తప్పులేదు. ఆలోచించు" అంటూ వెళ్ళిపోయింది నీడ.

మేధావి నిజంగానే జబ్బుపడ్డాడు. బాగా చిక్కిపోయాడు. "నీవు చూట్టానికి నీడలాగా తయారయ్యావేం?" అన్నారు స్నేహితులు. ఈ మాట వినగానే అతడు వణికిపోయాడు.

ఒక రోజున నీడ మళ్ళీ వచ్చింది. నీవు చల్లని దేశానికి రావలసిందే. మునుపటి పరిచయం మన కుండనే ఉన్నది. నా వెంట తప్పకుండా తీసుకెడుతాను. ఏమాత్రం ఖర్చుండదు. అన్ని ఖర్చులు నేనే భరిస్తాను. అక్కడి విశేషాలనంతా నువ్వు వ్రాయవచ్చు. నా గడ్డం యింతకంటే ఎక్కువ పెరుగదు. ఆలోచించు. మన మిద్దరం అన్నదమ్ముల్లాగా ప్రయాణం చేయవచ్చు" అన్నది నీడ.

చివరికి మేధావి ఒప్పుకొన్నాడు. ఇద్దరూ ప్రయాణాన్ని ప్రారంభించారు. మేధావి నీడగాను, నీడ యజమానిగానూ మారిపోయారు. ఇద్దరూ దీర్ఘ ప్రయాణంలో ఉండగా యజమాని రూపంలో ఉన్న నీడ అన్నది.

"మనం చిన్నప్పటినుండీ సహచరులుగా పెరిగాము. సంతోషంగా ఉందీ ప్రయాణం. కొంచెం ద్రాక్షరసాన్ని సేవించి మళ్ళీ వెడుదాం."

"అలాగే దానికేం బాగానే ఉంది ఆలోచన" అన్నాడు నీడ రూపంలో ఉన్న మేధావి.

ఇద్దరూ ఒక క్రీడా సరోవరం దగ్గఱకు వచ్చారు. అక్కడదివరకే చాలమంది ప్రయాణీకు లున్నారు. వారి మధ్యలో కన్పించిం దొక అందమైన రాకుమారి.

నీడవలె అనుకరిస్తూ వస్తున్న మేధావిని చూచి ఆమె అనుమానించింది. మెల్లగా వారి దగ్గఱకు వచ్చి సంభాషణ మొదలు పెట్టింది.

"మీ విషయం చాల విచిత్రంగా ఉంది. మీరు నీడలుగా ఎట్లా మారిపోగలరో మరీ ఆశ్చర్యమైన విషయం" అన్నది రాకుమార్తె.

"మీకు ఆశ్చర్యంగానే ఉండవచ్చు. నాతో తిరుగుతున్న మనిషిని మీరు చూచే ఉంటా రనుకొంటాను. ఇతరులకు మామూలైన నీడ ఉండవచ్చు. అది వేరు. మనం నౌకరులకు సాధారణంగా బట్టలు కుట్టిస్తుంటాము. అలాగే నేను నా నీడను మనిషిగా మార్చివేశాను. అతనికి మళ్ళీ ఒక నీడను యిచ్చాను. ఇది చాల విపరీతంగా కన్పించినా, ఎక్కువ ఖర్చైనా నాకోసం అలా చేయవలసి వచ్చింది." అన్నది.

ఆ సాయంకాలం నీడతో నృత్యం చేసింది రాకుమారి. నృత్యం చేస్తున్నప్పుడు రాకుమారి ఏదేశాన్నుండి వచ్చినదో, ఎక్కడ నివసిస్తున్నదో అన్ని విషయాలు పూసగ్రుచ్చినట్లు చెప్పింది. నీడ కన్నీ తెలుసు. తను ఆ నగరంలోనే నివసించడం గుర్తుకు వచ్చింది. తానక్కడ ఉన్నప్పుడు రాజకుమారి నగరంలో లేదు.

ఇతడు చాల తెలివైన వాడను కొన్నది రాకుమారి. నీడను ప్రేమించింది. నీడతో మరల మరల ఆనందంతో నాట్యం చేసింది. నీడకున్న జ్ఞానాన్ని పరీక్షించా లనుకున్నది.

తనకే తెలియని విషయాలను గురించి జవాబులు చెప్పమని ప్రశ్నించా లనుకున్నది.

"నే నడిగే ప్రశ్నలకు నీవు సమాధానాలు చెప్పలే వనుకొంటాను" అన్నది రాకుమారి.

"ఆ విషయాలు నాకు చిన్నతనంలోనే తెలిసి ఉంటాయి. అదో అక్కడ తలుపువద్ద కన్పించే నా నీడే సమాధానం చెప్పగలదు" అన్నది నీడ.

"నీడ చెప్పగలదంటారా? ఇది మరీ అద్భుతంగా ఉంటుంది" అన్నది రాకుమారి.

"ఖచ్చితంగా చెప్పగలదని నేను చెప్పడం లేదు. చెప్పగలదని మాత్రం అనుకున్నాను. ఎన్నో సంవత్సరాల నుండి నా వెంట తిరుగుతూ నా మాటలను వింటున్నది గనుక సాధ్యం కావచ్చునని అనుకొన్నాను. మీరు గనుక అనుమతించి నీడను కూడా మనిషిగా భావించితే, మనిషి కివ్వదగిన మర్యాదనిస్తే నీడ చేతనే జవాబులు చెప్పిస్తాను" అని చెప్పగానే, "అలాగే" నన్నది రాకుమారి.

రాకుమారి తలుపు దగ్గఱ నీడ రూపంలో నున్న మేధావి దగ్గఱకు వెళ్ళి నిలబడింది. సూర్యుని గురించీ, చంద్రుని గురించీ, గతించిన వారిని గురించీ, బ్రతికియున్నవారిని గురించీ ఎన్నో ప్రశ్నలను వేసింది. నీడ రూపంలోని మేధావి ప్రతి ప్రశ్నకూ సరియైన సమాధాన మిచ్చాడు.

రాకుమారి ఆబ్బురపాటుతో యిలాంటి తెలివైనవానిని తన సలహాదారుగా ఉంచుకొంటే రాజ్యానికీ ప్రజలకూ సైతం మేలు కల్గుతుందని అనుకొన్నది.

రాకుమారి నీడను తన రాజధానికి తీసుకొని వెళ్ళింది. నగరం చేరగానే నీడ మేధావితో అన్నది:

"నా కిప్పుడు చాలా ఆనందంగా ఉంది. గొప్ప స్థితికి వచ్చాను. నీకు కావలసినన్ని సౌకర్యాలు కల్గించాలనుకొన్నాను. నాతోపాటే ఈ నగరంలో ఉండిపో. రాజభోగాలు అనుభవించవచ్చు. సంవత్సరానికి పదివేల వరహాల జీతం ఏర్పాటు చేస్తున్నాను.

కానీ ఒక్క విషయం మాత్రం మఱచిపోకూడదు. ఎవరడిగినా నువ్వు నీడవని మాత్రం చెప్పాలిగానీ మనిషివని మాత్రం చెప్పకూడదు. ఏడాదికొకసారి డాబామీద సూర్యోదయమపుడు నేను కూర్చుంటాను. నీవు నీడవలె నా పాదాలమీద పడాలి. నేను రాకుమారిని పెళ్ళాడబోతున్నాను. ఈ సాయంకాలమే శోభన లగ్నం. ఏమంటావ్?"

ఈ మాటలు వినగనే మేధావి మండిపడ్డాడు. "ఇది మరీ విపరీతంగా ఉంది. నా కా జీతమూ వద్దు. ఆ భోగమూ వద్దు. ఆ పనీ చేయను. రాజ్యాన్నీ రాకుమారినీ కూడా మోసగించి నట్లవుతుంది. ఈ విషయాన్ని రాకుమారికి చెబుతాను. నేనే నిజమైన మనిషిననీ, నీవు మనిషి రూపంలో నున్న నీడవనీ నిజం చెప్పేస్తాను" అన్నాడు.

"నీ మాటను నమ్మే నాధుడెవరు. ఆలోచించి ఒప్పుకో. లేకుంటే రాజభటుల్ని పిలుస్తాను" అన్నది నీడ.

"నేను సరాసరి రాజకుమారివద్దకు వెడుతాను" అంటూ పైకి లేచాడు మేధావి. "అయితే నేనే ముందుగా వెడుతాను. ఫలితంగా నీవు జైలుకు పోవలసి ఉంటుంది" అని బయలుదేరింది నీడ.

రాకుమారిని కలుసుకోగానే నీడ వణికిపోయింది.

"ఏమిటలా అదిరిపోతున్నావు. నీ విలా ఉండకూడదు. ఈ సాయంకాలం వివాహం కదా" అన్నది రాకుమారి.

"నా కీ దినం చాల విచారంగా ఉంది. పాపం నా నీడ పిచ్చిదై పోయింది. మతి భ్రమించింది. అది నిజంగానే మనిషి ననుకొంటున్నది. నేను దాని నీడనని చెప్పుకొంటున్నది. ఈ పిచ్చినుండి గట్టెక్కుతుందని నేను అనుకోలేదు" అన్నది నీడ.

"అయ్యో పాపం! చాలా దురదృష్టమైందా నీడ. ఈ బాధనుండి దాన్ని తప్పించడం చాల అవసరం. ఒక్కసారిగా అన్ని బాధలూ పోయే విధంగా చేయాలి. సుఖపడుతుందప్పుడు" అంటూ విచారాన్ని వెలిబుచ్చింది రాకుమారి.

"అది చాలా కష్టమైన పని. నమ్మకమైన సేవకునివలె సేవ చేసిన నీడను త్యజించుకోవడం యెట్లా" అంటూ అదో విధంగా చూచింది నీడ.

"నీవు బలే ఘటికుడివి" అంటూ నవ్వింది రాకుమారి.

సాయంకాలం నగరమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది రంగు రంగుల దీపాలతో. సైనికులు ఉత్సవంలో పాల్గొన్నారు. వివాహం జరిగిపోయింది.

రాకుమారి, నీడతో వచ్చి డాబా మీద కన్పించగానే అందరూ హర్షధ్వానాలు చేశారు.

మేధావికి ఈ అట్టహాసాల గురించి ఏమీ తెలియదు. అత డీ హర్షధ్వానాలను గూడ వినలేదు. రాజకుమారి ఆజ్ఞతో అతని ప్రాణాల నెప్పుడో తీసేశారు రాజభటులు.

నిజమైన మేధావి చచ్చిపోయాడు. నీడవలె వచ్చిన వ్యక్తి రాజభోగాలు అనుభవిస్తున్నాడు—ఎంత మోసం!

[సమాప్తం]



సోల్ ఏజంట్లు: దాదా అండ్ కో., 86,
నైనియప్ప నాయక్ వీధి, మద్రాసు—3.